సమస్యల ప్రస్తావనే తప్ప పరిష్కారమేదీ?

- ఎనిమిది నెలలుగా బిల్లులు రావడం లేదు
- ప్రకటనలకే పరిమితమైన పంటనష్టం పంపిణీ
- మిల్లర్లు అడ్డగోలుగా దోచుకుంటున్నా చర్యలు శూన్యం
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ప్రశ్నల వర్షం



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేశ్

వెల్గటూర్: సర్వసభ్య సమావేశంలో సమస్యల ప్రస్తావనే తప్ప వాటికి పరిష్కారం చూపించడంలో మాత్రం అధికారులు అలసత్వం వహిస్తున్నారని సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వెల్గటూర్ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కూనమల్ల లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా వివిధఅంశాలపై సభ్యులు అధికారులను ప్రశ్నించారు. దాదాపు ప్రతీ సమావేశంలో చాలా అంశాలను అధికారుల దృష్టికి తెచ్చినా వాటికి పరిష్కారాలు చూపడంలో అధికారులు ఆసక్తి చూపడం లేదని, ఈ మాత్రం దానికి సమావేశాలు నిర్వహించడం ఎందుకని సభ్యులు ప్రశ్నించారు. ఎలాగూ సమస్యలకు పరిష్కారం చూపడం లేదని సమావేశాలకు సభ్యులు రావడమే మానేశారు. ఈ సందర్భంగా కేవలం నలుగురు సర్పంచులు మాత్రమే సమావేశాలకు హాజరయ్యారు. ఎనిమిది నెలలుగా బిల్లులు రావడం లేదని సర్పంచులు ఆవేదన వ్యక్తంచేశారు. అకాల వర్షాలతో మండలవ్యాప్తంగా ఎంతమేర పంటనష్టం వాటిల్లింది? పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంలో నిబంధనలు ఏమిటీ? ఎంతమందికి నష్టపరిహారం అందిచారని అధికారులను ప్రశ్నించారు. తడిసిన ధాన్యాన్ని తేమశాతంతో సంబంధం లేకుండా కొంటామని మంత్రులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అది అమలవడం లేదని, కొనుగోలు కేంద్రాల్లో సరైన వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ధాన్యం కొనుగోలులో నిబంధనలు అమలు చేయడం లేదని, తప్ప తాలు పేరుతో మిల్లర్లు రైతులను దోచుకుంటున్నా సంబంధిత అధికారులు వారిపై చర్యలు తీసుకోవడంలేదని అధికారులపై సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలపై స్పందిస్తూ తప్పకుండా సమస్యలను పరిష్కరిస్తామని, రైతులను ఇబ్బంది పెడుతున్న మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని ఎంపీపీ లక్ష్మి అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, వెల్గటూర్, ఎండపల్లి ఎమ్మార్వోలు రమేశ్, ఉదయ్‌కుమార్ వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి కృపతో సంపూర్ణ అభివృద్ధి


ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మల్లాపూర్: పెద్దమ్మతల్లి కృపతో నియోజకవర్గంలో సంపూర్ణ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. గురువారం మల్లాపూర్ మండలంలోని గొర్రెపల్లిలో నిర్వహిస్తున్న పెద్దమ్మతల్లి జాతర ఉత్సవాల్లో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్, ప్రభుత్వం కృషిచేస్తోందని ఇందుకు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నారని కొనియాడారు. జిల్లాలోని ఆలయాల అభివృద్ధికి ఎంపీ కవిత ప్రత్యేక చొరవ తీసుకుని సీఎం కేసీఆర్, దేవాదాయ శాఖ మంత్రి ఐకేరెడ్డికి విన్నవించగా, రూ. కోట్లల్లో నిధులు మంజూరుచేశారన్నారు. టీటీడీ బోర్డు నుంచి సుమారు రూ.6 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించి నియోజకవర్గంలోని ఆలయాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, సర్పంచ్ కొంపెల్లి సరోజన, ఎంపీటీసీ తోట సుజాత, ఏఎంసీ మాజీ చైర్మన్ కదుర్క నర్సయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ నాయకులు ఆదిరెడ్డి, ఏలేటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్నూరుకాపుల అభివృద్ధికి సహకరిస్తా


ఎమ్మెల్యేను కలిసిన జిల్లాపంచాయతీ అధికారి

జగిత్యాల: మున్నూరుకాపులు వ్యవసాయానికి వెన్నుముఖలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్నూరుకాపు కల్యాణ మండపం నిర్మాణానికి రూ. 30 లక్షలు మంజూరు ఉత్తర్వుల కాపీని సంఘం సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరుకాపుల అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరిస్తానన్నారు. ప్రభుత్వం ఏర్పాటు తర్వాత కులవృత్తులకు ప్రోత్సహకాలు అందిస్తూ అన్నివర్గాలు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు హరి అశోక్‌కుమార్, బాదినేని రాజేందర్, రాజ్‌కుమార్, తోటమల్లికార్జున్, సమిండ్ల శ్రీనివాస్, కూసరి అనిల్ పిట్ట ధర్మరాజు, మధుసూదన్ పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లా పంచాయతీ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన దేవరాజ్ గురువారం ఎమ్మెల్యేక్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

‘విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవద్దు’


సర్టిఫికెట్లతో విద్యార్థులు, సిబ్బందితో విద్యాసాగర్ రావు

మెట్‌పల్లి : పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమని మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని అమ్మక్కపేటలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టాట్ స్రైవ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎస్సారెస్పీ ఫంక్షన్ హాల్‌లో గురువారం సర్టిఫికెట్ల ప్రధానోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవద్దని, వారికి శిక్షణను ఇచ్చి ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు దోహదపడుతున్నాయన్నారు. ఇప్పటి వరకు 972మందికి శిక్షణను ఇచ్చి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాణించిన మాధురిని, ఇంటర్‌లో 992మార్కులు సాధించిన మారంపల్లి దాత్రిజను ఆయన అభినందించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, సురభి భూమ్‌రావు, నవీన్‌రావు, మేనేజర్ హరికృష్ణ, తదితరులున్నారు.

బైపాస్ రోడ్డు నిర్మించాలి

మేడిపెల్లి: నిజామాబాద్ నుంచి జగిత్యాల 63వ నంబర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో భాగంగా మేడిపెల్లి మండలకేంద్రంలో బైపాస్ రోడ్డునిర్మించేలా కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కేంద్ర మాజీ మంత్రి విద్యాసాగర్‌రావును మేడిపెల్లి గ్రామస్తులు కోరారు. కోరుట్ల వెళ్లేక్రమంలో మార్గమధ్యలో మేడిపెల్లిలో ఆగిన చెన్నమనేనిని గ్రామస్తులు సన్మానించారు. గ్రామం నుంచి రోడ్డు విస్తరణ జరిగితే సుమారు 2 కిలోమీటర్ల మేర నివాసాలు కొల్పోతారని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని బైపాస్ రోడ్డువేసేలా కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రంలో కోరారు. దశరథరెడ్డి, అఖిల్, విశ్వనాథం, కాశీనాథం, పోతు గణేశ్ ఉన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న చెన్నమనేని

కోరుట్లరూరల్: మాజీ కేంద్రమంత్రి, మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు పట్టణంలో గురువారం జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. వనతడుపుల రవికుమార్, న్యాయవాది బోయిని సత్యనారాయణ కూతుళ్ల వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

జోరందుకున్న ధాన్యం కొనుగోళ్లు


ధాన్యం తూకం చేస్తున్న హమాలీలు

పెగడపల్లి: యాసంగి ధాన్యం కొనుగోళ్లు వేగంగా సాగుతున్నాయి. పెగడపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 10 కేంద్రాల నుంచి నేటి వరకు సుమారు రూ.11.95 కోట్లు విలువైన 58వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు చైర్మన్ రమణారావు, సీఈవో గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం మాట్లాడుతూ.. పెగడపల్లిలో 10,763 వేలు, ఆరవెల్లిలో 8246, లింగాపూర్‌లో 3548, వెంగళాయిపేటలో 4724. కొండాయపల్లిలో 4454, శాలపల్లిలో 1098, దోమలకుంటలో 4008, మద్దులపల్లిలో 11012, ఏడుమోటలపల్లిలో 5611, సుద్దపల్లిలో 4736 క్వింటాళ్ల చొప్పున ధాన్యం సేకరించినట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు.

డిమాండ్లు నెరవేర్చేవరకు సమ్మెకొనసాగిస్తాం



జగిత్యాలరూరల్: డిమాండ్లను నెరవేర్చేంత వరకు సమ్మె కొనసాగిస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమురయ్య అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ్మె విరమణ ఎట్టిపరిస్థితుల్లో కుదరదన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జెడ్పీచైర్‌పర్సన్ తుల ఉమ మద్దతు తెలిపి రూ.40వేల ఆర్థిక సాయం అందించారు. జిల్లా పంచాయతీ కార్యదర్శులు సంతోష్, రవళి, వంశీధర్, రాజిరెడ్డి, రాజు, మల్లికార్జున్, నజీమ్, అక్బర్ పాల్గొన్నారు.

ఎంఐఎం చేతిలో కారు స్టీరింగ్


మాట్లాడుతున్న బోగ శ్రావణి

జగిత్యాల: రాష్ట్రంలో కారు స్టీరింగ్ ఎంఐఎం చేతిలో ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణి అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేలా ఓ వర్గం పట్టణ నడిబొడ్డున ఆందోళన చేపట్టారని, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో పాటు 12 మంది హైకోర్టు న్యాయమూర్తులు బీరప్ప దర్శనానికి వచ్చారని, అసౌకర్యం కల్పించారన్నారు. రెండ్రోజుల క్రితం బస్సులో సీటు విషయంలో జరిగిన దానికి మతం రంగు పులిమి ఆందోళనకు దిగారని ఆరోపించారు. వాస్తవాలను వెలికితీయకుండా ప్రభుత్వం ఓ వర్గానికి కొమ్ము కాస్తోందన్నారు. పోలీసు అధికారికే భద్రత లేకుంటే ఎలా అని ప్రశ్నించారు. పోలీసు అధికారిపై చర్యలు తీసుకోవాలంటూ నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, కోరుట్ల ప్రాంతాల నుంచి జగిత్యాలకు భారీగా తరలివచ్చినా నిఘా సంస్థలు ఎందుకు ఆరా తీయలేదన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అనిల్‌కుమార్, జిల్లా అసెంబ్లీ కన్వీనర్ మదన్‌మోహన్, జగదీశ్, సత్యం, వరుణ్‌కుమార్, రాజన్న, ఉమేశ్, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



కథలాపూర్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి అన్నారు. కథలాపూర్ మండలం భూషణరావుపేటలో శ్రీ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా గురువారం యజ్ఞం నిర్వహించారు. సాయంత్రం వేళ భక్తులనుద్దేశించి మాట్లాడారు. ప్రజలు ఆర్థిక ఎదుగుదలకు తపనపడడం మాని ప్రతీరోజు ఇష్టదైవాలను పూజించాలని, సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

హనుమాన్ పెద్ద జయంతికి ఏర్పాట్లు పూర్తి


ముస్తాబైన నృసింహుడి ముఖ ద్వారం

ధర్మపురి : శ్రీలక్ష్మీ నృసింహస్వామి అనుబంధ ఆలయమైన శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించే మానుమాన్ పెద్ద జయంతి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 13 నుంచి 15 వ రకు స్వామివారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. జయంతి వేడుకల సందర్భంగా భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు, తాగునీటి వసతి, తదితర ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

కొండగట్టు టు ధర్మపురి..

హనుమాన్ దీక్షలు చేపట్టిన భక్తులు ముందుగా కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. అక్కడే మాల విరమణ, తలనీలాలు సమర్పించి తర్వాత ధర్మపురికి చేరుకుంటారు. భక్తులు పవిత్ర గోదావరిలో స్నానాలు చేసి అనంతరం లక్ష్మీ నృసింహస్వామిని, ప్రసన్నాంజనేయస్వామి ఆలయాల్లో దర్శనం చేసుకుంటారు.

‘ముస్లిం మహిళను కించపర్చలేదు’


మాట్లాడుతున్న సంధ్య

జగిత్యాల క్రైం: రెండు రోజుల క్రితం ఆర్టీసీ బస్సులో జరిగిన సంఘటనలో తాను ముస్లిం మహిళను కించపర్చలేదని, వారేతమపై అకారణంగా దాడి చేశారని రూరల్ ఎస్సై భార్య సంధ్య అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తాను ఇద్దరు పిల్లలతో ఆర్టీసీ బస్సు ఎక్కానని, సీట్లు నిండిపోవడంతో ఇద్దరు మహిళలున్న సీట్లో కూర్చున్నట్లు తెలిపారు. వారే తనను అకారణంగా నెట్టివేసి దురుసుగా ప్రవర్తించారన్నారు. జగిత్యాల బస్టాండ్‌లో దిగిన తర్వాత బెదిరించడంతో తనభర్తకు ఫోన్ చేశానని, తన భర్త ఎవరిపై దాడిచేయలేదన్నారు. అకారణంగా సస్పెండ్ చేయడం సరికాదని, తమకు న్యాయం చేయాలని కోరారు.

ఎస్సై సస్పెన్షన్

జరిగిన ఘటనపై ఎస్సైతో పాటు, మరో ముగ్గురిపై ఓ వర్గం వారు ఆందోళన చేపట్టగా కేసు నమోదు చేశారు. బుధవారం పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టడంతో జగిత్యాల రూరల్ ఎస్సై అనిల్‌ను ఎస్పీ భాస్కర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేశారు. పోలీసు ఉన్నతాధికారులకు ఒత్తిడితో అనిల్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

మార్కండేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



కథలాపూర్: మండలంలోని తాండ్య్రాలలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రతిష్ఠాపనోత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తరలించారు. అనంతరం పూజలు చేశారు. ఈ ఉత్సవాల్లో సర్పంచ్ గంగప్రసాద్, వైస్‌ఎంపీపీ కిరణ్‌రావు, పద్మశాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా



కోరుట్లరూరల్: సరైన పత్రాలులేని ప్రైవేటువాహనాలకు రవాణా,ఆర్టీసీ అధికారులు జరిమానాలు విధించారు. ఈమేరకు రాయికల్ రోడ్డులో ఎంవీఐ రంజిత్‌కుమార్, ఆర్టీసీ అధికారులు గురువారం ప్రైవేట్ వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఆర్టీసీ ఆదాయనికి గండికొడుతూ పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ప్రైవేటు వాహనాలను పట్టుకుని పత్రాలు పరిశీలించి జరిమానాలు విధించారు. 30 వాహనాలు తనిఖీ చేసి 6 వాహనాలను సీజ్ చేశారు. రూ.70వేల జరిమానాలు విధించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం లక్ష్మీప్రసూన, ఆర్టీసీ, రవాణా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: విద్యార్థులు మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను గురువారం అభినందించారు. ప్రభుత్వ కాలేజీల్లో చదివి టాపర్లుగా నిలవడం అభినందనీయమన్నారు. అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి నారాయణ, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

మల్యాల: పదోతరగతిలో 10 జీపీఏ సాధించిన ఆణిముత్యాలను డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. మల్యాల మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని సాహితి 10 జీపీఏ సాధించింది. స్థానిక వాగ్దేవీ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు మ్యానసపావని, సంధ్యమైత్రి, అర్జున్, సాయిసూర్య 10 జీపీఏ సాధించగా కరస్పాండెంట్ నరేశ్‌ను ఎంఈవో శ్రీనివాస్ అభినందించారు.

ధర్మపురి: మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన ఎం.అక్షిత పది పరీక్ష ఫలితాల్లో 9.7 జీపీఏ సాధించింది. నర్సయ్యపల్లెకు చెందిన వైశాలి మగ్గిడి ఆదర్శపాఠశాల విద్యార్థిని 9.7 జీపీఏ సాధించింది. జైనా గ్రామానికి చెందిన దొంతుల శార్వానీ ధర్మపురిలోని ఆంగ్లోవేదిక్ పాఠశాలలో 10జీపీఏ,శ్రీధర శ్రీమైత్రి, ఇక్రా యాసిన్ 9.8 జీపీఏ సాధించారు.

ఎస్సెస్సీ మండల టాపర్‌కు సన్మానం

కథలాపూర్: ఎస్సెస్సీ ఫలితాల్లో కథలాపూర్ మండల టాపర్‌గా నిలిచిన తాండ్య్రాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఒగ్గు హారికను ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు గురువారం పాఠశాలలో సన్మానించారు. హారిక 9.8 జీపీఏ సాధించి మండలస్థాయిలో తాండ్య్రాల ప్రభుత్వ పాఠశాలకు గుర్తింపు తెవడం అభినందనీయమన్నారు. హరికతోపాటు 9 జీపీఏ సాధించిన మిగతా విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, వైస్‌ఎంపీపీ కిరణ్‌రావు, హెచ్‌ఎం దూమాల స్వామి, ఎస్‌ఎంసీ చైర్మన్ చాంద్ పాషా, వీడీసీ చైర్మన్ అల్లూరి జనార్దన్‌రెడ్డి, ఏనుగు జలంధర్, పానుగంటి సాగర్, టీచర్లు పాల్గొన్నారు.

సరస్వతీ శిశుమందిర్ విద్యార్థుల సత్తా

కోరుట్ల: పట్టణంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు పది పరీక్షా ఫలితాల్లో సత్తాచాటారు. జాప హర్షిణి 9.7 జీపీఏ, చెట్పల్లి ఇషాంత్ 9.5 జీపీఏ సాధించారు. వీరిని పాఠశాల ప్రభందకారిని, సమితి సభ్యులు అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ నీలి శ్రీనివాస్, ప్రభందకారిని అధ్యక్షుడు డాక్టర్ వేముల రవికిరణ్, కార్యదర్శి వనపర్తి చంద్రమోహన్, కోశాధికారి నీలి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె శివప్రసాద్ పాల్గొన్నారు.

వైద్యసిబ్బందికి సన్మానం


వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న గ్రామస్తులు

రాయికల్: మండలంలోని ఆలూరు గ్రామంలో కంటివెలుగు వైద్యశిబిరం ముగియడంతో గురువారం వైద్యాధికారి నరేంద్ర, హెచ్‌ఈవో శ్రీనివాస్ వైద్య సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మీ, ఎంపీటీసీ సురేందర్, ఉపసర్పంచ్ రాజు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు చెక్




ధర్మపురి: గోదావరి నుంచి అక్రమంగా ఇసుకను తరలించేందుకు కొందరు ఏర్పాటు చేసుకున్న రహదారికి అధికారులు గండికొట్టారు. దీంతో అక్రమ ఇసుక రవాణ నిలిచిపోయింది. కొందరు ఇసుకను అక్రమంగా తరలించేందుకు గోదావరి ఒడ్డునున్న గోలివాడ, కుమ్మరివాడల గుండా నది వరకు రహదారిని ఏర్పాటుచేసుకుని ఈ దారిగుండా ఇసుక అక్రమ రవాణ చేపట్టారు. అక్రమ రవాణ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారులు గమనించి గురువారం రహదారికి పొక్లెయిన్‌లతో గండి కొట్టారు.

సంక్షిప్త వార్తలు

అన్యాయాన్ని ప్రశ్నించాలి

మెట్‌పల్లి: అన్యాయాన్ని ప్రశ్నించేలా ప్రజలు చైతన్యవంతులు కావాలని హ్యూమన్ రైట్ మై నార్టీ మహిళా సెల్ విభాగం జాతీయ అధ్యక్షురాలు రానా తబస్సుం పేర్కొన్నారు. జగిత్యాల లో దాడికి గురైన మైనార్టీ యువతికి అండగా నిలిచిన మర్కజీ ఇంతేజామి కమిటీ అధ్యక్షులు ఖుత్బుద్దీన్‌తో పాటు ఇతర నాయకులను పట్టణంలో గురువారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు అ న్యాయం జరిగితే ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సాదక్, ఫిరోజ్, రహీమొద్దీన్, అజీజ్, జావిద్, ఇలియాస్ తదితరులున్నారు.

మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటుచేయాలి

మెట్‌పల్లి: పట్టణంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి గురువారం కోరారు. మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కోరుట్ల లో కేంద్రాలు ఏర్పాటుచేసిన అధికారులు, మెట్‌పల్లిలో ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే ఏర్పాటు చేయాలన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో వద్ద జరిగిన ఘటనపై హైదరాబాద్‌లోని ఎంఐఎం పార్టీకి చెందిన నాంపల్లి ఎమ్మె ల్యే జాఫర్‌హుస్సేన్ గురువారం జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్‌ను కలిశారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనవెంట నిజామాబాద్ డెప్యూటీ మేయర్ ఇద్రీష్, కరీంనగర్ కార్పొరేటర్లు అజార్, అబ్బాస్ అమీ, అతీన, సర్ఫొద్దీన్ ఉన్నారు.

గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

జగిత్యాలజోన్: జిల్లాలో ఎస్సెస్సీ, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు గౌడ సంఘం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దుర్గపు రవీందర్‌గౌడ్ తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షల్లో 90 శాతంకు పైగా మార్కులు సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. గౌడ విద్యార్థులు బయోడెటా, ఫొటో, మార్కుల జాబితాతో దరఖాస్తులను ఈ నెల 23లోపు జిల్లా గోపా కార్యాలయంలో అందించాలన్నారు. వివరాలకు గోపా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్‌ను 93475 64517లో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

ఆదివాసీ గిరిజనులకు హక్కుపత్రాలివ్వాలి


ఆదివాసీ గిరిజనులతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్: మండలంలోని జగన్నాథపూర్‌లో నిరుపేద ఆదివాసీ గిరిజనులకు భూమి హక్కు పత్రం కల్పించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గురువారం జగన్నాథపూర్ గిరిజనులతో కలిసి కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాయికల్ మండలం బోర్నపల్లి రెవెన్యూ గ్రామపంచాయతీలోని జగన్నాథపూర్‌కు చెందిన ఆదివాసీ గిరిజనులకు ఏలాంటి పట్టాభూములు లేక బోర్నపల్లి పరిధిలోని సర్వేనంబర్ 171లో 50ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని, విద్యుత్ సౌకర్యం కూడా కల్పించారని, వీరికి హక్కు పత్రాలు అందించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

విద్యార్థులు గమ్యం చేరేవరకు శ్రమించాలి


మణిమాలను సన్మానిస్తున్న తహసీల్దార్

మల్లాపూర్: విద్యార్థులు గమ్యం చేరేవరకు శ్రమించాలని తహసీల్దార్ రవీందర్ అన్నారు. గురువారం మల్లాపూర్ మండలంలోని సిరిపూర్‌లో ఇంటర్ సెకండీయర్ బైపీసీ స్టేట్ టాఫర్ సునావత్ మణిమాలను ఘనంగా సన్మానించారు. మణిమాల స్టేట్ టాపర్‌గా నిలవడం అభినందనీయమన్నారు. మణిమాల భవిష్యత్‌లో మరింత ఉన్నతమైన స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్య గోవింద్‌నాయక్, ఎంపీటీసీ ఏనుగు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

జగిత్యాల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ గోలిశ్రీనివాస్ అన్నారు. గురువారం ఉదయం కార్మికులకు సంబంధించిన హాజరును పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు విధులకు హాజరు కావాలని, పట్టణ పురవీధులను పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ కప్పల శ్రీకాంత్ ఉన్నారు.

సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలి

రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లో ఈ నెల 15 నుంచి నిర్వహించే సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ లావుద్య సంధ్యారాణి అన్నారు. గురువారం రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ క్రీడా పోటీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతీ గ్రామం నుంచి క్రీడాకారులు హాజరు కావాలని, అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు పీఈటీ బందెల శ్రీనివాస్, ప్రతాప్, పుష్పలత, సుజాతను సంప్రదించాలని కోరారు. తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీడీవో సంతోష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

మల్లాపూర్: మండలంలోని గొర్రెపల్లిలో బొమ్మెన నవజ్యోతి (21) అనే వివాహిత ఈనెల 10న అదృశ్యమైనట్లు ఎస్సై నవీన్‌కుమార్ గురువారం తెలిపారు. గొర్రెపల్లికి చెందిన బొమ్మెన రాజేందర్ - నవజ్యోతి దంపతులకు పాప ఉంది. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు వెతికినా ప్రయోజనం లేక రాజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు న మోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాన్స్‌కో కార్యాలయంలో గొడవ

కోరుట్ల: కోరుట్ల ట్రాన్స్‌కో ఉద్యోగులు కార్యాలయం ఆవరణలోనే గొడవపడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతనెల 19న కోరుట్ల రూరల్ విభాగంలో పనిచేసే ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్, అదే కార్యాలయంలో పనిచేసే ఓ ఆర్టిజన్ ఉద్యోగి కార్యాలయం ఆవరణలోనే దాడి చేసుకున్నారు. దీంతో వారిద్దరూ పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నట్లు సమాచారం. కార్యాలయంలో ఉన్న తాగునీటి విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం నెలకొని గొడవకు దారితీయగా దాడి చేసుకోవడంతో వీడియో వైరల్ అయింది. ఈ మేరకు విచారణ చేపట్టినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

చెట్టును ఢీకొన్న డీసీఎం

మల్యాల: మామిడికాయల లోడుతో వెళ్తున్న డీసీఎం చెట్టును ఢీకొనగా ఒకరు గాయపడ్డారు. మండలంలోని ముత్యంపేట శివారు జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి మామిడి కాయల లోడుతో జగిత్యాల వైపు వెళ్తున్న డీసీఎం బ్రేక్ ఫెయిల్ కావడంతో రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో వ్యాన్ చెట్టులో ఇరుక్కుపోవడంతో జేసీబీ సాయంతో వాహనాన్ని బయటకు తీశారు. వాహన డ్రైవర్ గాయపడగా, 108 సిబ్బంది బాధితుడికి ప్రాథమిక చికిత్స నిర్వహించి, జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.